# పోస్టు చెయ్యని ఉత్తరం

✻ శ్రీ గోపీచంద్ ✻

నా వైఖరి చూస్తే నాకు హేతువాదం మీదకూడ నమ్మకం పోయినట్టు కనిపిస్తూవుందా? మంచిది. నీకు ఇలా అనిపించడానికి కారణం లేకపోలేదు అనిమాత్రం నేను ఒప్పుకుంటాను కాని నాకు హేతువాదంమీద నమ్మకం పోలేదు. పోతే సహజజ్ఞానంమీద ఇదివరకు వున్న ఏహ్యాభావంమాత్రం ఇప్పుడు లేదని చెప్పగలను.

నీకుజ్ఞాపకం వుంటే వుంటుంది. మనం మన చిన్నతనంలో సహజజ్ఞానాన్ని చాల అసహ్యించుకుంటూ వుండేవాళ్లం. హేతువాదం మానవులకు సంబంధించింది అనీ, సహజజ్ఞానం జంతువులకు సంబంధించింది అనీ చెప్పుకొని, ఇతరులతో వాదిస్తూవుండే వాళ్లం గాంధీగారు, మాటిమాటికీ తాను చేసేపనులకు కారణాలు చెప్పకుండా, 'నా అంతర్వాణి చెప్పింది' అంటూవుంటే, మనం ఎంతగా హేళన చేసేవాళ్లం! 'ఆయన అంతర్వాణి అటు చెపితే మాఅంతరాత్మ ఇటు చెప్పింది,' అనేవాళ్లం. 'ఉత్తమ పురుషుల అంతర్వాణికి విలువవుందిగాని, నీఅంతర్వాణికి విలువలేదు,' అని ఎవ్వరైనా అంటే, 'నేనూఉత్తమ పురుషుణ్ణే,' అనేవాళ్లం ఈఅంతర్వాణిని గురించి అనిబిసెంట్ గాంధీగారిని విమర్శించినప్పుడు, మనం హృదయపూర్వకంగా ఆమెను వందించాం.

ప్రస్తుతం నాకు హేతువాదంమీద నమ్మకం పోలేదుగాని సహజజ్ఞానాన్ని గురించిమాత్రం అభిప్రాయం మారింది. ఇది వొకప్పుడు మనం అనుకున్నంత పనికిమాలిన గుణంగా నాకు కనపట్టంలేదు. అంతేకాదు. మనం భ్రమ పడటంతప్ప, ఈగుణం మనలను విడిచి పెట్టిందీ లేదు. మనకు సహజజ్ఞానం ఎక్కడనుంచి వొచ్చింది? పరిణామం వల్ల వచ్చింది. దానిని తెలుసుకునే శక్తిమనకు లేకముందే, అదిమనకువుంది. అనుభవం వల్ల వొచ్చిన ఈ జ్ఞానం వొక జాతినుంచి మరొక జాతికి అందజెయ్య బడుతూనేవుంది. ఇది జంతువుల దాకా వొచ్చి అంతటితో ఆగి పోలేదు. మనం హేతువాదులం అయినంత మాత్రాన, మనకు సహజజ్ఞానం లేదు అనుకోవటం పొరపాటు.

"శారీరక జీవితానికి సుముఖంగా, అనాలోచితంగా రియాక్టు అయ్యేగుణాన్నే, ఇన్‌స్టింక్ట్ అంటున్నాం" అన్నాడు రసెల్. ఇదినిజమయితే మానవుడు దీనివల్ల పొందే సహాయం ఏమీ లేదనుకోవంటగాని, ఇదేదో పశులక్షణం అనుకొని దీన్ని దౌర్జన్యంగా అణచుకోటానికి ప్రయత్నించటంగానీ, ప్రమాదకరంగా పరిణమిస్తుంది అని అనుకోటానికి ఏమాత్రం సందేహించనక్కరలేదు అనుకుంటాను. అంటే నేనుఅచ్చగా సహజజ్ఞానంమీద ఆధారపడమంటున్నాననీ, హేతువాదాన్ని నిర్లక్ష్యం చెయ్యమంటున్నానని నీవుభ్రమపడవలసిన అవసరంలేదు సహజజ్ఞానం, తనస్వభావాన్నిబట్టి మామూలు పరిస్థితుల్లో తనపనినితాను సక్రమంగా నిర్వర్తించవచ్చుగాని, విపరీతపరిస్థితుల్లో తప్పటడుగు వేస్తుంది. దీన్నిమనం ఎప్పటికప్పుడు మనఅనుభవంలో పోల్చిచూచుకొని సరిచేసుకుంటూఉండాలి ఇంతేకాకుండా, మరొకవిధంగాకూడా దీనిఅవసరం మనకుఉంది. మనం నేర్చుకొనేశక్తిని ఎంతసంపాదించినా నేర్చుకోటానికిప్రేరపణఇచ్చేది ఈ సహజజ్ఞానమే. కాబట్టిమనజీవితాలకు దీని అవసరం ఎప్పటికప్పుడు ఉంటూనేఉంటుంది. ఇదిఉట్టుడియంగా కొట్టివెయ్యదగ్గగుణంగా కనపట్టంలేదు. Analisis of the devil అనేగ్రంథంలో బెర్ట్రాండ్ రస్సెల్ దీనిప్రయోజకత్వాన్నిగురించి ఈవిధంగావ్రాశాడు- "బోనుల్లోవున్న జంతువులు, తప్పించుకోటానికని, ఇటూఅటూతిరుగుతై. ఈ తిరగడం, వాటికున్న సహజజ్ఞానంవల్ల జరుగుతుంది కాని, ఈ విధంగా తిరగటం అనేదే జరక్కపోతే తప్పించుకునేవిధానం తెలుసుకోలేవు అన్నేవిషయం మనంజ్ఞాపకంఉంచుకోవాలి. ఈవిషయం మనుష్యులకుకూడా వర్తిస్తుంది. పిల్లలు తామకోరిన మాటవచ్చేవరకూ అనేకధ్వనులుచేస్తారు ఈ విధంగా ధ్వనులుచెయ్యకుండా మాటలు నేర్చుకోలేరు ఈ ధ్వనులుచెయ్యటం సహజజ్ఞానంవల్ల జరుగుతుంది. ఇక పెద్ద

# పోస్టు చెయ్యని ఉత్తరం

వారివిషయం మనఅలవాట్లలోను, రుచులలోను, సహజజ్ఞానం యొక్క ప్రోద్బలం కనిపిస్తూనేఉంటుంది". అన్నాడు

కాబట్టి సహజజ్ఞానాన్ని ఏజంతులక్షణంక్రిందా జమకట్టి దానికి మనజీవితాలలో ఏమాత్రంచోటు లేదనుకొని తోసివెయ్యటానికి వీలులేదు దానిశక్తికి హద్దులున్నమాటనిజమే! కానిదాని అవసరం ఉండనేఉంది. హద్దులప్రమేయంవస్తే, ఈప్రపంచంలో దేనికి హద్దులులేవు? హేతువాదానికిమాత్రం హద్దులులేవా? ఆధ్యాత్మికవాదులు హేతువాదంమీద సత్యాన్వేషణకు ఆధారపడరనే విషయం నీకుతెలిసినవిషయమే! హేతువాదం సరైనసాధనంకాదు అంటారు ఆధ్యాత్మికవాదులు హేతువాదం యొక్క అసంపూర్ణ స్వభావాన్నిగురించి నళినీకాంతగుప్త ఈవిధంగావ్రాశాడు - హేతువాదం అంటే ఏమిటి? హేతువాదం మనకిచ్చేజ్ఞానం ఎటువంటిది? మనం సంపాదించేజ్ఞానం మంచిచెడుగులు మనంఅనుసరించే విధానం మీదా, ఉపయోగించే సాధనంమీద ఆధారపడి ఉంటాయి గదా! కాబట్టి హేతువాదం స్వభావాన్నిముందు మనం తెలుసుకోవాలి హేతువాదం మనకు అందుబాటులోవున్న విషయాలను తీసికొని వాటినిబట్టి సిద్ధాంతీకరిస్తుంది అన్ని విషయాలూ మనకు అందుబాటులో వుండవు అనేవిషయం నీవు అంగీకరిస్తావు అనుకుంటాను కాబట్టిహేతువాదంవల్ల మనంపొందేజ్ఞానం యదార్థజ్ఞానం కాకపోవచ్చు మరొక విషయం ఏమిటంటే హేతువాదం విలువచూసేవారి చూపునిబట్టి ఉంటుంది ఈప్రపంచంలో ఎవరిచూపు వారిదే! ఏఇద్దరి చూపు ఒకటిగావుండదు. ఈవిషయం సైన్సుకూడా అంగీకరిస్తుంది అందువల్ల పూర్తి సత్యాన్ని తెలుసుకోవటం హేతువాదంవల్ల కాకపోవచ్చు.

★


## మైసూరు పట్టు బట్టలు

### హెచ్చుకాలము మన్నిక కలవి

మునుపటికంటె ఇప్పుడు మైసూరు సిల్కు వస్త్రములే హెచ్చుగా స్త్రీలు ధరించుచున్నారు మైసూరు సిల్కులో శ్రేష్ఠమైన చీరెలు, గౌనుగుడ్డలు, రవికె గుడ్డలు మొదలైన స్త్రీలకు పురుషులకూడా అవసరమగు సర్వవిధములగు దుస్తులును అధికముగా వాడబడుచున్నవి.

★

మైసూరు సిల్క్సు
100 కి నూరు వంతులు
స్వచ్ఛమైనవి, కల్తీలేని
పట్టువి

★

## మైసూర్ సిల్క్స్

గవర్నమెంట్ సిల్కు వీవింగు ఫ్యాక్టరీ, మైసూరు